


# ఏకాదశి ఉపవాసం

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

**కృష్ణా జిల్లాలోని ఓ చిన్న గ్రామం నించి హైవే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామం నించి ఎక్కడికి వెళ్ళాలన్నా ఆ గ్రామం నించి వచ్చే తారు రోడ్డు, హైవే కలిసే చోటకి వచ్చి బస్ ఎక్కాలి. ఆరోజు ఆ గ్రామం నించి వచ్చిన ఎనిమిది మంది ఆ బస్‌స్టాప్‌లో విజయవాడకి వెళ్ళే బస్‌కోసం ఎదురుచూస్తున్నారు.**

**వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. కృష్ణమాచారి, ఆయన భార్య రుక్మిణీ, వారి ఆరుగురి సంతానం.**

ఆ గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణమాచారి అర్చకుడిగా పనిచేస్తున్నాడు. ఆయన పద్దెనిమిదేళ్ళ పెద్దకొడుకు రామాచారిని విజయవాడకి వెళ్ళే బస్ ఎక్కించడానికి అంతా వచ్చారు. ఇంటర్ మీడియెట్ పూర్తిచేసిన రామాచారికి విజయవాడలోని ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ నడిపే ఫేక్టరీలో ఉద్యోగం వచ్చింది. ఆ ఫేక్టరీ పక్కనే గల గుళ్ళో పూజారిగా పని చేసే కృష్ణమాచారి అత్తయ్య కొడుకు రంగాచారి ఆ ఉద్యోగాన్ని ఇప్పించాడు. మొదటిసారిగా ఇల్లు వదిలి దూరం వెళ్తున్న రామాచారికి వీడ్కోలు చెప్పడానికి కుటుంబ సభ్యులంతా వచ్చారు.

వారిది పేద కుటుంబం. కొడుకుని డిగ్రీ చదివించేంత సంపాదన ఆయనకి లేదు. పైగా అతను సంపాదించి పంపితే దాచి కూతురి వివాహం చేయాలని కృష్ణమాచారి ఆలోచన. బస్ వచ్చేలోగా ఆయన తన కొడుకు చెప్పాడు.

"నే చెప్పినవన్నీ గుర్తున్నాయిగా?"

గుర్తున్నాయన్నట్లుగా రామాచారి తలూపాడు.

రెండు రోజులనించే కృష్ణమాచారి కొడుక్కి స్వతంత్ర జీవితంలో ఎలా ప్రవర్తించాలి, డబ్బు ఎలా ఖర్చుచేయాలి మొదలైన విషయాల గురించి నూరిపోస్తున్నాడు.

"జీతం రాగానే నెల ఖర్చులకి కొంత ఉంచుకుని మిగిలింది బాబాయ్‌కి ఇచ్చేయి. ఏకాదశినాడు మన వైష్ణవులు ఉపవాసం తప్పనిసరిగా ఉండాలి. ఆ నియమాన్ని తప్పకు. ఆరోజు ఆహారం తీసుకుంటే నరకానికి వెళ్తాం."

సరేనన్నట్లుగా రామాచారి తలూపాడు.

"సంధ్యావందనం కూడా మానకు."

చెప్పినవే మరికొన్ని జాగ్రత్తలు చెప్తూండగా విజయవాడ వెళ్ళే బస్ వచ్చింది. చేతిలోని రెండు బరువైన సంచీలతో బస్ ఎక్కాడు రామాచారి. బస్ కిటకిటలాడుతూండటంతో లోపలకి ఎక్కిన రామాచారి మళ్ళీ వాళ్ళకి కనపడలేదు. బస్ వెళ్ళిపోయింది. ఐనా బస్ పావు కిలోమీటర్ దూరం వెళ్ళేదాకా అతని తమ్ముళ్ళు, చెల్లెళ్ళు తమ చేతులని ఊపుతూనే ఉన్నారు. తర్వాత అంతా తమ గ్రామానికి వెళ్ళే తారురోడ్డులోని బస్ స్టాప్‌కి చేరుకున్నారు.

మూడుగంటల తర్వాత రామాచారి ఎక్కిన బస్ విజయవాడలో కృష్ణలంక దగ్గర ఆగింది. రామాచారి రెండు సంచులతో బస్ దిగాడు. ఎత్తైన రోడ్డుమీద కొద్దిదూరం నడిచి, కిందకి ఉన్న మెట్లు దిగి కృష్ణలంకలో ఓ సన్న సందులోని తన బాబాయ్ ఇంటికి కాలినడకన చేరుకున్నాడు. అతని బాబాయ్ వరదాచారి రామాచారిని ఆదరంగా ఆహ్వానించాడు.

తన తండ్రి ఇచ్చిన ఉత్తరాన్ని రామాచారి తన బాబాయ్‌కి ఇచ్చాడు. అది చదివి ఆయన ఆనందంగా చెప్పాడు.

"నీకు ఉద్యోగం వచ్చిందన్నమాట. చాలా సంతోషం. మీ నాన్న ఆర్థిక కష్టాలు కొంతదాకా తీరినట్లే. ఇక్కడ్నించి మీ ఫేక్టరీకి సిటీ బస్ ఉంది. అరగంట దూరం."

మొదటిరోజు నుదుట నామాలు పెట్టుకుని బయటకి వెళ్ళే రామాచారితో, అప్పటికే వైష్ణవ ధర్మాలని వదిలేసిన వరదాచారి చెప్పాడు.

"నువ్వీ బొట్టుతో ఫేక్టరీకి వెళ్తే అంతా నిన్ను వింతగా చూస్తారు."

"ఐనా నాన్నగారు ఊర్ధ్వ పుండ్రాలని వదలద్దని చెప్పారు."

రామాచారి దుర్గ కొండకి వెళ్ళి అమ్మవారికి దణ్ణం పెట్టుకుని ఫేక్టరీకి వెళ్ళి ఉద్యోగంలో అప్రెంటిస్‌గా చేరాడు. తన బాబాయ్ తనని బరువుగా భావిస్తున్నాడేమోననే భయం రెండువారాల్లోనే పోయింది. ఆయన, కుటుంబ సభ్యులు అంతా రామాచారిని పరాయి వాడిలాకాక ఆప్యాయంగా చూసుకోసాగారు.

* * *

చిన్న గ్రామంలో పుట్టి పెరిగిన రామాచారికి విజయవాడ నగర జీవితం కొత్తగా ఉంది. రామాచారి ముతక దుస్తులని చూసి, అతని పల్లెటూరి భాషని చూసి చాలా మంది ఆటపట్టించసాగారు. ఒకరిద్దరు తోటి పనివాళ్ళు అతన్ని సంస్కరించడం మొదలెట్టారు. క్రమేపి రామాచారిలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. క్రాఫ్ వెనక ఉండే పిలకని తీసేసాడు. చెవులకున్న బంగారు తీగలని తీసేసాడు. నుదుట నిలువు బొట్టుని పెట్టుకోవడం మానేసాడు. చూడగానే సిటీలో పుట్టిపెరిగిన వాడిలా తయారయ్యాడు.

ఐతే ఒక్క ఏకాదశి ఉపవాసాన్ని మాత్రం రామాచారి ఓ పట్టాన మానలేకపోయాడు. తన తండ్రి దానికి ఎంతటి ప్రాధాన్యతని ఇస్తాడో చిన్నప్పటినించీ తెలుసు కాబట్టి ఏకాదశి రోజు పచ్చి మంచినీళ్ళు తప్ప ఇంకేం తీసుకోవడం లేదు. ద్వాదశి ఘడియలు వచ్చాకే ఆహారం తీసుకోవడం కొనసాగించాడు.

మొదటి ఏకాదశి రోజు అతని చిన్నమ్మ ఉదయం అందరికీ బ్రేక్‌ఫాస్ట్ పెడుతూ అతనికీ పెట్టింది.

"ఒద్దు. ఇవాళ ఏకాదశి. తినను" నిరాకరించాడు.

"ఉపవాసం ఉంటే ఇంక ఫేక్టరీలో పనేం చేయగలవు? మేమంతా మానేయలా? ఫర్వాలేదు. తిను."

రామాచారి ఆవిడ మాటలు వినలేదు. ఆవిడ అన్నట్లుగానే ఆరోజు ఫేక్టరీలో మధ్యాహ్నం పన్నెండు దాటాక పని సరిగ్గా చేయలేకపోయాడు. అది గమనించిన సూపర్‌వైజర్ అడిగాడు.

"ఏం? ఒంట్లో బాగాలేదా?"

"బానే ఉంది."

"మరి ఏమిటలా డల్‌గా ఉన్నావు?"

"ఇవాళ ఏకాదశి కాబట్టి ఉపవాసం ఉన్నాను."

"నీ అసాధ్యం కూలా? ఉపవాసం ఉండి పనిలోకి ఎలా వచ్చావు? కడుపు మాడుతూంటే ఇంక పనేం చేస్తావు?"

గంట ముందే పర్మిషన్ ఇచ్చి పంపేసాడు.

"ఇంకెప్పుడు ఉపవాసం ఉండక, ఏకాదశికి నాముందు నువ్వు ఏదో ఒకటి తిని తీరాలి." వెళ్ళబోయే ముందు చెప్పాడు.

* * *

రెండు వారాల తర్వాత ఓరోజు మళ్ళీ ఏకాదశి

వచ్చింది. చిన్నమ్మ ఇడ్లీలు పెడితే చెప్పాడు.

"ఇవాళ ఏకాదశి. ఉపవాసం."

ప్రతీ ఏకాదశికి రామాచారి ఫేక్టరీకి ఏదో కారణం చెప్పి శెలవ పెట్టసాగాడు. త్వరలోనే సూపర్‌వైజర్ రామాచారి ప్రతీ ఏకాదశికి శెలవ పెడుతున్నాడని గ్రహించాడు. ఐదో ఏకాదశి ముందురోజు రామాచారి సూపర్‌వైజర్‌కి శెలవ చీటి ఇచ్చి చెప్పాడు.

"రేపు శెలవ కావాలండి. మా చిన్నమ్మని డెంటిస్ట్ దగ్గరకి తీసుకెళ్ళాలి."

"చూడు రామాచారి. నువ్వు మంచి పనిమంతుడివి. నీ పని నాకు నచ్చుతోంది. ఐనాసరే రేపు నువ్వు కనక ఫేక్టరీకి రాకపోతే ఇక నీకు ఉద్యోగం ఉండదు. ఈ ఏకాదశి ఉపవాసం మానేయమని చెప్పానా? రేపు వచ్చి నా ముందు నువ్వు కేంటీన్‌లో ఇడ్లీ తినాలి. లేదా ఇంకో ఉద్యోగం వెదుక్కో."

రామాచారి ఖిన్నుడై ఇంటికి వెళ్ళాడు. సూపర్ వైజర్ అన్న మాటలు తన బాబాయ్‌తో చెప్పాడు. ఆయన రామాచారికి గట్టిగా చెప్పాడు.

"తప్పు నీదే. మేం ఎప్పటినించో చెప్తున్నాం. నీకు ఏకాదశి ఉపవాసం ముఖ్యమో లేదా ఉద్యోగం ముఖ్యమో తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ ఉద్యోగంపోతే మళ్ళీ ఇలాంటి ఉద్యోగం ఇంకోటి దొరకడం కష్టం."

ఆరోజు తండ్రి తనకి రాసిన కార్డుని చదివాడు రామాచారి. అందులో ఏకాదశి ఉపవాసం గురించి హెచ్చరిస్తూ రాసాడు ఆయన.

చిన్నమ్మ లాలనగా చెప్పింది. రామాచారి మనసు పరిపరి విధాల పోతోంది. ఉపవాసం మానేసి ఉద్యోగం చేసుకుంటూ బ్రతకాలా లేక ఉపవాసం చేసి సరైన వైష్ణవుడిగా బతకాలా? తను వైష్ణవుడిగా బతకడంకన్నా ఆర్థిక సహాయం చేసే కొడుకుగా బతకడం మేలుకదా? కాని తన తండ్రి ఏకాదశి ఉపవాసానికి ఎంతటి గౌరవం ఇస్తాడో తనకి తెలుసు. తను దాన్ని మానేసాడని ఆయనకి తెలిస్తే చాలా బాధపడతాడు. ఆయన బాధపడటం ఎలా ఉన్నా అది మానేయడానికి తనకే మనస్కరించడం లేదు. ప్రపంచంలో ఇదొక్కటే ఉద్యోగంకాదుగా. ఇంకోటి దొరక్కపోదు.

గాలిలో పెట్టిన దీపంలా అతని మనసు అటు, ఇటు ఊగసాగింది. మర్నాడు ఉదయం చిన్నమ్మకి చెప్పాడు.

"నేనివాళ ఉపవాసమూ ఉంటాను. పనీ చేస్తాను. పని చేయడానికి ఆ విష్ణుమూర్తే తగిన శక్తిని ఇస్తాడు."

ఏం తీసుకోకుండా బయటకి వచ్చాడు. బస్‌స్టాప్‌లో బస్‌కోసం నిలబడ్డాడు. బస్ వచ్చినా ఎక్కలేదు. రెండు బస్‌లు వెళ్ళేదాకా ఆలోచిస్తూండిపోయాడు. తీరా వెళ్ళాక సూపర్‌వైజర్ ఏదైనా బలవంతంగా తినమంటే అప్పుడు బయటకి వచ్చేకన్నా అసలు ఫేక్టరీకి వెళ్ళకపోవడం మంచిది అనిపించింది. ఉద్యోగం పోతే పోనీ అనే తెగువ భక్తివల్ల బలపడింది. దాంతో కృష్ణ ఒడ్డుకి వెళ్ళి అక్కడ కృష్ణానదిని చూస్తూ కూర్చున్నాడు. విష్ణు సహస్ర నామాలని పదిసార్లు మనసులో చదువుకున్నాడు. కృష్ణ నీటినే తాగాడు. బుట్టలో చితాభస్మాన్ని తెచ్చి కొందరు నీళ్ళల్లో కలిపి వెళ్ళడం చూసాడు. సాయంత్రం అయిదయ్యాక ఇంటికి బయలుదేరాడు.

మళ్ళీ ఆలోచనలు తీవ్రతరం అయ్యాయి. తను ఫేక్టరీకి రాలేదని తన సూపర్‌వైజర్‌కి కోపం వచ్చి ఉంటుంది. తనది అప్రెంటిస్‌షిప్పే కాబట్టి తనని అతను తేలిగ్గా ఉద్యోగంలోంచి తీసేయగలడు. తన ఉద్యోగం పోయిందని తెలిస్తే తన బాబాయ్. చిన్నమ్మలు తిడతారు. తమ మాట విననందుకు వాళ్ళకి కోపం వస్తుంది. ఇంకో ఉద్యోగంకోసం ప్రయత్నం చేసుకోడానికి ఉండమంటారో? లేదా తిరిగి పల్లెకి వెళ్ళిపొమ్మంటారో? ఎక్కడ ప్రయత్నం చేయాలి? ఎవర్ని అడగాలి? వివిధ ఆలోచనలతో తన ఇంటి సందు మలుపు తిరిగాడు. తన తండ్రి మాత్రం తన చర్యని సమర్థిస్తాడు అన్న బలమైన నమ్మకంతో ఇంట్లోకి అడుగుపెట్టాడు. తన తండ్రి ఎదురు పడటం చూసి ఆశ్చర్యపోయాడు.

> "చూడు రామాచారి. నువ్వు మంచి పనిమంతుడివి. నీ పని నాకు నచ్చుతోంది. ఐనాసరే రేపు నువ్వు కనక ఫేక్టరీకి రాకపోతే ఇక నీకు ఉద్యోగం ఉండదు. ఈ ఏకాదశి ఉపవాసం మానేయమని చెప్పానా? రేపు వచ్చి నా ముందు నువ్వు కేంటీన్‌లో ఇడ్లీ తినాలి. లేదా ఇంకో ఉద్యోగం వెదుక్కో."

'వచ్చావురా?' అంటూ ఆయన అమాంతం రామాచారిని కౌగలించుకుని పెద్దగా ఏడవసాగాడు. తండ్రి ఈ ఆకస్మిక ప్రవర్తనకి బిత్తరపోయాడు రామాచారి.

"ఎలా తప్పించుకున్నావు?" అడిగాడు వరదాచారి.

'తప్పించుకోవడం ఏమిటి?" ఎదురుప్రశ్న వేసాడు రామాచారి.

"ఇవాళ నువ్వు ఫేక్టరీకి వెళ్ళలేదా?" ఆశ్చర్యంగా అడిగింది చిన్నమ్మ.

"లేదు. వెళ్తే బలవంతంగా తినిపించి నా సూపర్‌వైజర్ ఏకాదశి ఉపవాసం మానిపిస్తాడని కృష్ణ ఒడ్డున కూర్చుని వస్తున్నాను."

"నీ ఉపవాసం నీకు మంచే చేసింది. ఇవాళ ఉదయం పదిన్నరకి మీ మందుల ఫేక్టరీ అంటుకుంది. మంటల్లో చిక్కుకుని కొందరు మరణిస్తే, కొందరు విషవాయువులకి మరణించారు. మొత్తంమీద మీ ఫేక్టరీలో పనిచేసే వారిలో ఇవాళ తప్పించుకున్నవారు ఎవరూ లేరు. ఇది టివిలో చూసి నేను, మీ నాన్న పరిగెత్తుకుంటూ వచ్చాం." చెప్పింది రామాచారి తల్లి.

"ఏకాదశి ఉపవాసానికి ఫలితం ఉండదనుకుంటారు. చూసావా? నీ ఉపవాసమే నిన్ను కాపాడింది. జీతం ముఖ్యం అనుకుని అది మానేస్తే ఈపాటికి నువ్వూ బుగ్గి అయిపోయి ఉండేవాడివి." కృష్ణమాచార్యులు ఆనందంగా చెప్పాడు.

ఫేక్టరీని పునఃప్రారంభించేదాకా రామాచారికి జీతం ఇవ్వడమేకాక, అతన్ని తిరిగి పనిలోకి చేర్చుకుంది యాజమాన్యం. అతని చేత ఉపవాసం మానిపించడానికి ప్రయత్నించిన అతని సూపర్‌వైజర్ ఇప్పుడు లేడు.

★

రచయిత చిరునామా:
మల్లాది వెంకట కృష్ణమూర్తి,
1-1-728/ఏ
గాంధీనగర్, హైదరాబాద్- 500080

